# పరిష్కారం

'జయశ్రీ'

["ప్రపంచంలోని మానవకోటి జీవిత రీతులలో ఎంతో వైవిధ్యం. భగవంతుడు సృష్టించిన యీ మానవులు ఆకారవయాలలో ఒకరితో మరియొకరు సరిపోలినా "మనస్సు" అనేటువంటి కీలక స్థానంలో మానవుడు మరియొకరితో సరిపోలడు. కొంతమంది యీ ప్రపంచము, ప్రపంచములోని మానవునిగా తన కనీసపు బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తించాలని తీర్మానించుకొంటారు .తదనుగుణంగానే తమ జీవితాలకు సోపానాలను ఏర్పరచుకోవాలని ఆకాంక్షిస్తారు. కాని "కలిసిరాని కాలం" వారి నిర్ణయాలకు శత్రువవుతుంది. నిర్విణ్ణులయి, నిస్సహాయంగా చేసేదిలేక పరిస్థితులకు బానిసలులాగా తల ఒగ్గుతారు. కరుణారహితమైన కాలనిర్ణయంలో కీలుబొమ్మలుగా నిలిచిపోతారు. అటువంటివారిలో మిగిలిపోయే ఆనందమల్లా చింతాభరితమైన గతస్మృతులు మాత్రమే !"]

పొద్దున్న ఆరుగంటలనుండి రాత్రి ఏడుగంటల వరకు హాస్పిటలులో రోగులకు సేవ చేస్తు డాక్టరు రవి మంచి ప్రశస్తిని గడించారు.

ఒక్కొక్కప్పుడు తనలో తానే అనుకుంటాడు "డాక్టర్ల జీవితాలలో ప్రఖ్యాతి అనేటువంటిది అశాశ్వతమని !"

ఎందుకంటే ఒక రోగం నయం చేయగలిగితే యీ డాక్టరంత గొప్పవారు లేరని అందలాని కెత్తుతారు. విధి కలిసిరాకపోతే దురదృష్టవశాత్తు రోగి మరణిస్తే ఆ వైద్యుడిని నలుగురు తిడతారు. అందుకనే సంతోషము. దుఃఖము అనేటువంటి భావోద్రేకముల నుండి వారి హృదయములు చాలా దూరంగా ఉంటాయి.

ఆ రోజంతా డా॥ రవి మనస్సు చికాకుగా ఉన్నది. హాస్పిటలులో కూడా అనుకోని విధంగా రెండు కేసులు ఫెయిలు కావటంతో కలవరపాటుతో అప్రయత్నంగా ఒక అర్థగంట ముందుగానే యింటికి తిరిగి రావటం జరిగింది.

లోపలనుండి సన్నగా తన మధురమైన గాత్రంతో కూనిరాగాలు తీస్తూ సుశీల పనిచేసుకొంటోంది. విశాలమైన ఆ హాలులో మధ్యగానున్న రేడియోగ్రాములో భానుమతి తన శ్రావ్యమైన కంఠముతో "సావిరహే తవదీనా" పాడిన పాట వినవస్తోంది.

తను చాల అదృష్టవంతుడని ఎందుకో అప్రయత్నంగా తనలో తానే తీర్మానించుకొన్నాడు సుశీల లాంటి జీవిత భాగస్వామి తన అభిరుచులకు అనుగుణంగా భార్యగా లభించటం నిజంగా భగవంతుడు తనకొసగిన వరప్రసాదిత మనిపించిది. హాస్పిటలులో పని అంతా పూర్తిచేసుకొని యింటికి తిరిగి రాగానే సుశీల సన్నిహితంలో ఏదో తెలియని ఆనందాన్ని, తన బరువు బాధ్యతలను సక్రమంగా నెరవేర్చ గలుగుతున్నానన్న ఆత్మ సంతృప్తి కలుగుతుంది.

ఇంతలోనే "లెటర్స్ సార్ !" అంటు కంపౌండర్ కృష్ణమూర్తి పరిగెత్తుకొచ్చి ఉత్తరములను

పట్టుకొని తన పనిని సక్రమంగా నిర్వర్తిస్తున్నానన్న సూచనను తెలియజేస్తూ నిలబడ్డాడు.

పైని పనులు చేసుకుంటూ "అలా టేబుల్ మీద పెట్టి వెళ్లు" అన్నాను.

మెల్లమెల్లగా భోజనం చేసిన తరువాత చదువుదామనుకొన్నా. కాని వాటి మామూలు ధోరణిలో టేబులు దగ్గరకు తీసుకొని వెళ్ళాయి. వాటిని చేతిలోకి తీసుకొన్నదే తడవుగా "అవి ఎక్కడనుండి వచ్చాయా" అని చిరునామా కోసం వెతుక నారంభించాయి అతని నేత్రద్వయం

ఆశ్చర్యం ! అంతులేని ఆనందం! ఆ దస్తూరి నిజంగా తన ప్రాణ స్నేహితుడైన రాజుదేనంటే నమ్మలేక పోయాను. దానికి కారణం వాడు వివాహం చేసుకొన్న తరువాత ఉత్తరం వ్రాయటం యిదే ప్రథమం !

"యూన్‌లెస్ ఫెలో; వట్టి అమాయకుడు." వాడికి తనకి మధ్యనున్న స్నేహం, ఆత్మీయత ఒక దశాబ్దం నాటిది. ఇన్ని రోజుల తరువాత రాజు వ్రాసిన ఉత్తరమును చూడగానే నాలో తెలియని ఆతృత. దానిలో సారాంశ మేమిటాన్న ఆసక్తి అధికం కాగా, చేతులు అప్రయత్నంగా కవరును తెరచి తమ పనిని పూర్తి చేశాయి . . .

డియర్ రవి,

"ఈ ఉత్తరం నీలో చాలా ఆశ్చర్యాన్ని కలుగజేస్తుందేమో. నాకేమాత్రం చింత లేదు. ఎందుకంటే నీ ప్రియమైన రాజు జీవితమే యీ ప్రపంచంలో ఒక వింతగా ఉన్నది కాబట్టి!"

రాజుగాడు వ్రాసిన ఉత్తరంలో ఏవేవో క్రొత్త విషయాలుంటాయని, తన సంసార సుఖాలు, తన ఉద్యోగంలోని కష్టనిష్ఠురములు మరియు యితర విషయములలాంటి, తమ కాలేజీలో విద్యార్థులుగా నున్నప్పుడు జరిగిన సంఘటనలను గూర్చి వ్రాసి ఉంటాడని ఊహించిన నేను వాడు వ్రాసిన ఉత్తరంలోని విధానాన్ని చూడగానే చాలా కలవరపాటును కలిగించింది. నాలో ఏదో తెలియని గాంభీర్యత, యింతకీ అసలు విషయ మేమిటో తెలుసుకోవాలన్న కోరిక నాలో అధికమయింది. మనస్సును ఉగ్గబట్టుకొని, సర్వ జ్ఞానేంద్రియములను వాడి ఉత్తరము మీదనే కేంద్రీకరించి, యింతకి వీడికి జరగబోయే విపత్తేమిటా? అన్న మీమాంసతో మిగత ఉత్తరాన్ని చదివి పూర్తిచేయటానికి ఉపక్రమించాను.

రవి !

మన యిద్దరిమధ్య ఏర్పడిన స్నేహలత యీలాగునే నిత్యం పుష్పిస్తూ శోభాయమానంగా అభివృద్ధి చెందుతూంటే ఎంత బాగుండునని నాలోనేను అనుకుంటూంటాను. కాని భగవంతుడు నాకంతటి అదృష్టాన్ని యివ్వలేదు. నిజానికి నాలాటి దురదృష్టవంతులు అంతటి భాగ్యానికి అనర్హులేమో ననిపిస్తోంది.

రవి! నా పెండ్లయిన తర్వాత నాలో ఏదో క్రొత్త మార్పు ఉంటుందేమోనని ఊహించుతూ ఉంటావు. కాని లేదు రవి ! నీ రాజులో మార్పు అంటు కలిగితే యీ ప్రపంచాన్ని వీడి దూరంగాపోయి అంతరాంతరాలలో కలసిపోయినప్పుడు మాత్రమే ! రవి! ఈ ప్రపంచములో నన్ను ఎవరయినా సరిగా అర్థం చేసుకున్న వారంటు ఉంటే అది నువ్వొక్కడివే. కాని నావలన నీకేమాత్రమయినా జరిగే ఉపకారమంటు ఉంటే అది నీ మనస్సుకు తద్వారా ఆందోళనను కలిగించటం. క్షమించు రవి ! ఇక ఆ కష్టంకూడా కొన్ని రోజులు మాత్రమే ! నాలాటి వారికి యీ ప్రపంచములో స్థానం ఉండకూడదు.

నేను శారదకు చేసిన ద్రోహం క్షమించరానిది నాలో గూడుకట్టుకొని ఉన్న స్వార్థం, సంఘాన్ని ఎదు

రించలేని పిరికితనం శారదను నానుండి దూరం చేశాయి మా యిద్దరి ఎడబాటుకు కారణభూతాల య్యాయి. పరలోకంలో ఉన్న శారద నన్నెప్పుడు క్షమించదు. రవి! గతాన్ని తవ్వుకొని, నీ మనస్సుకు ఆందోళన కలుగజేసి నిన్ను అనవసరంగా కష్టపెడు తున్నాను, మిత్రుడిగా నా కష్టసుఖాలలో భాగం తీసు కొని నన్ను చాలా ఆదరించావు. ప్రతిఫలంగా యీ రాజు నీకు ఏమీ యివ్వలేకపోగా మిగిల్చి వెళ్ళిపోతు న్నది యీ ఆందోళనను మాత్రమే.

రవి! అంతిమ ఘడియల్లో వ్రాస్తున్న యీ ఉత్తరం నాలో అంతులేని ఆనందాన్ని, నేను నోచు కోనటువంటి ప్రశాంతతను నాలో కలిగిస్తున్నది. ఇక ఆ ఆనందంకూడా కొద్ది ఘడియలు మాత్రమే. నాకు యింకా జీవించాలన్న కోరిక సన్నగిల్లింది. అయినా యింకా నేను ఎవరికోసం బ్రతకాలి? నాకు యీ ప్రపంచానికి ఉన్న అనుబంధం ఏమిటి?

రవి! పెద్దల కోరికకు అనుగుణంగా, పరిస్థి తులను అవగాహన చేసుకొని, నేను రాధని వివాహం చేసుకున్నాను. మా యిద్దరి జీవితంలోని ఆనందం సంవత్సరంకూడా పూర్తికాకముందే అంతరించింది.

ఒకనాడు హఠాత్తుగా "రాధ" నన్ను ఒంటరి వాడిని చేసి యీ లోకంలో నన్ను అనాధుడిగా చేసి దూరమయింది. కారణ మేమిటని డాక్టర్లని అడిగితే, వ్యాధి "సెరిబ్రల్ హెమ్మొర్హ్రియా" అని చెప్పారు. "నిజానికి అటువంటి వ్యాధి సాధారణమయిన వ్యక్తు లకు రాకూడదని, తాము శాయశక్తుల రాధను బ్రతి కించటానికి ప్రయత్నించామని కాని ప్రయోజనం లేక పోయిందని" వారంతా వగచారు చూశావా రవి! నామీద రాధకుకూడా అంతపగ? నువ్వే చెప్పురవి! ఇంక నేను ఎవరికోసం జీవించాలి?

నా అసమర్థతతో ఆనాడు శారదను బలి చేశాను. దేముడు కాదుకదా యింకెవ్వరు పాపం చేసినవారిని క్షమించరు. ఇక, అందరిలాగా యీ జీవితం మీద కోరికకూడ లేదు. అందుకనే కడసా రిగా ఆనందంతో నా మనస్సులోని విషయాల నన్ని టిని ఒక్కటొక్కటిగా చెప్పి శాశ్వతంగా కళ్ళు మూస్తాను. ఈ ప్రపంచాన్ని విడిచి నా శారదను కలుసుకుంటాను.

మరో విషయమేమిటో తెలుసా? . . . ప్రస్తు తం నేను ఒక పార్కులో ఉన్నాను. నా ప్రక్కనే ఉన్న "సయినైడు" సీసా నా వైపు తదేకంగా చూస్తూ, నేను చేసిన ఘోరమైన పాపానికి యిదే నిష్కృతి అంటూ, తనని త్వరగా సేవించమని ఆహ్వానిస్తోంది. నా శారదా, రాధల మధ్యకు ఎంత త్వరగా జేరుతానన్న ఆత్రుత నాలో ఎక్కువౌతోంది.

నిజంగా ఇటువంటి ఘడియలు నా జీవితంలో ఉంటాయని నేను కలలోకూడా ఊహించలేదు. బహుశా యీ ఉత్తరం నీకు జేరేటప్పటికి నా అం తిమ శ్వాస పంచభూతాలతో కలిసిపోతుంది. కనుక నీవు నా దగ్గరకు రావాలని గాని, నన్ను చూడాలన్న ప్రయత్నం గాని చేయవద్దు. భగవంతుడు నిర్ణయిం చిన యీ శిక్షను ఎవ్వరు అడ్డుపెట్టినా ప్రయోజనం ఉండదు. ఇక నాకు మిగిలిన ఆఖరి పరిష్కారం యీ విధమైన నిష్కృతి మాత్రమే!

రవి! చిన్నప్పుడు ఏవేవో అంటూండే వాడివి. కాని అవి గతించిన కాలంలోని పాత జ్ఞాప కపు నీలితెరలు మాత్రమే ననిపిస్తుంది.

నీలాటి ఉత్తముడు, సహృదయుడు భర్తగా లభించటం "సుశీల వదిన" చేసుకొన్న నోముల ఫలి తం. బహుశా ఆవిడకు నేనెవర్నో గుర్తుండక పోవచ్చును. కాని నా హృదయం మాత్రం నిత్యం మీ సుఖాన్ని, సంతోషాన్ని కోరుతూనే ఉంటుందని మర్చిపోవద్దు. సుశీలకు నా అభివందనలను తెలియ జేయ వలసింది.

ఇన్నేళ్ళుగా నీ హృదయంలో నాకిచ్చిన స్థానానికి నిత్యం నేను నీకు ఋణపడి యుంటాను. ఈ జన్మలో బహూశా ఆ ఋణాన్ని తీర్చుకోలేనేమో! అందుకు నన్ను మనసారా క్షమించమని వేడుకొంటున్నాను.

ప్రశస్తమైన నీ పవిత్రమైన కాలాన్ని చెఱుపుతున్నాను. రవి! నీవు నాయందు సానుభూతిని చూపించి యీ ఉత్తరాన్ని చదివినందుకు నా కృతజ్ఞతలు తెలియజేయకుండా ఉండలేక పోతున్నాను. అంతకన్నా యీ మిత్రుడు రాజు నీకు యివ్వగలిగేది కూడ ఏముంది గనుక?

రవి! నీ మిత్రుడు "రాజు" యిటువంటి పరిస్థితి వరకు దిగజారిపోతాడని నీవు కలలోకూడా ఊహించి ఉండవు కాని యింతకన్న వేరొక పరిష్కారం నాకు కన్పించలేదు. పైగా, కాలనిర్ణయాన్ని కాదనగల అధికారం ఎవ్వరికి లేదు అందుకనే ఆనందంతో కడసారిగా యీ జీవితమంటే విసిగి వేసారి ఒక్కసారిగా శాశ్వతంగా కన్ను మూస్తాను. అప్పుడయినా లోకం నన్ను క్షమించగలదన్న పేరాశతో యిక జీవితాన్ని చాలించాలని తీర్మానించుకున్నాను. నన్ను యీ లోకం మర్చిపోవాలి. అందుకనే యీ ప్రపంచం నుండి త్వరగా బయటపడాలన్న ఆతృతతో ఉన్నాను,

కాని ఒకటే బాధ రవి! అసమర్థునిగా జీవిత యాత్రలో విజయాన్ని సాధించలేక, యిక జీవించలేనేమోనన్న వెఱపుతో మరొకరితో చెప్పుకోలేనటువంటి ఆవేదనతో యీ జీవితాన్ని చాలించవలసి వస్తున్నదని మాత్రమే!

నేను చేసిన పాపానికి తగిన ప్రతిఫలమే లభిస్తున్నదన్న ఆనందం, యీ ప్రపంచాన్ని, యీ జీవితాన్ని యిదే జీవితంలో ఒక ఘట్టంగా రూపొందిన మన యిద్దరి ఆత్మీయతను దూరంచేసుకుంటు, నిన్ను మరవలేక మరవలేక, మరిచిపోవలసి వస్తున్న ఒక మిత్రునిగా ఉం_టా_ను.

శాశ్వతంగా నీనుండి దూరమౌతున్న
_నీ రాజు

అని వ్రాసివున్న వాడి ఉత్తరాన్ని భారంగా పూర్తిచేసి ప్రక్కనే ఉన్న వాలుకుర్చీలో కూలబడిపోయాను. నేను కూర్చున్న కుర్చీ కదులుతున్నట్లుగాను, నేను చూస్తున్న ప్రపంచమంతా గిర్రునతిరుగుతున్నట్లు, చెవులలో ఏదో పెద్దపెట్టున ఘోష వినిపిస్తున్నట్లుగా, సింహంలాటి మేఘములు భయానక గర్జనలు చేస్తున్నట్లుగా అన్పించింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. మనస్సంతా ఆవేదనా భరితమయింది.

పది సంవత్సరాలుగా చదువుకొని, ఆడుకొని కలసి తిరిగే రాజు యింకలేడు. అయినా, రాజు దగ్గరకు పరుగెత్తుకొనివెళ్ళి కడసారిగా చూసి రావాలనిపించింది. "కాని యింకెక్కడి రాజు? యీ ప్రపంచానికే దక్కకుండా మరో లోకానికి వెళ్ళిపోయాడని" మనస్సు సమాధాన పరిచింది. తను బ్రతికి ఉండంగానే రాజు ఆత్మహత్య చేసుకోవటం నాకు దుర్భరమనిపించింది. కాని పరిస్థితులు విషమించాయి. ఇంక నా రాజు లేడు. మనస్ఫూర్తిగా, ఒంటరిగా కూర్చొని ఏడ్వాలనిపించింది.

అంతరంగాలనుండి ఉబికి వస్తున్న దుఃఖము అతని కనుకొలకులనుండి భాష్పకణాలుగా విచారంగా జారుతున్నాయి.

పైన తిరుగుతున్న పంకారోదనను మినహాయించితే ఆ హాలులో నిశ్శబ్దం ఆవరించినట్లు గంభీరమైన వాతావరణం అలుముకొన్నది. యీ ప్రపంచ విషయాలతో సంబంధం లేనట్లు ఆ ఫాన్ మాత్రం యధా ధోరణిలో పనిచేస్తున్నది.

మనస్సు గతాన్ని శోధించుతోంది. పాత జ్ఞాపకపు నీలితెరల చాటునుండి, నిత్య దరహాసంతో తిరిగే రాజు తొంగి చూస్తున్నాడు.

చేతనుడై కూడా, అచేతనావస్థలో తమ యిద్దరి జీవితాలలోని పాతకాలపు జ్ఞాపకపు పుటలను ఒక్కొక్కటిగా మననం చేస్తున్నాడు రవి.

కాలం ఒక్కసారిగా పదిసంవత్సరాలుగా వెనుకకు మళ్లింది___

అప్పుడు తామిద్దరు కలసి బి. యస్సీ చదివిన రోజులు. ఆనాడు "రాజు లేనిచోట రవి ఉండడు, రవి లేని చోట రాజు కన్పించడని నలుగురు మా యిద్దరిని ఆడిపోసుకోవటం యింకా తనకి బాగా గుర్తు. చదువులోనయినా, ఆటల విషయంలో నయినా తామిద్దరి జీవితాలు అలా పెనవేసుకొని పోయాయి.

అప్పుడప్పుడు తెలుగు లెక్చరర్ రామాచారి గారు అంటూండేవారు "ఏమోయ్ రవి ! నీ అర్ధాంగి రాజుకి నీకు ఉన్న కాంట్రాక్టు ఎంతకాలమని ?"

నిజానికి వారిద్దరిలో ఎవరో ఒకరు స్త్రీగా జన్మిస్తే ఒకరినొకరు పెండ్లి చేసుకునే వారేమో ? కాని భగవంతుడు వారి యిద్దరిమధ్యనున్న బంధాన్ని అలా నిర్ణయించలేదు.

కాలం అనుకోని విధంగా వారిద్దరి చెలిమికి ఎడబాటు కలిగించింది. రాజు యం. యస్సీ చదవటం, తను యం. బి. బియస్‌లో చేరటంతో తమ యిద్దరి జీవిత పంథాలలో మార్పు కలిగింది. కాని ఆ నాటినుండి యీ నాటి వరకు తమ యిద్దరి మధ్య ఏర్పడిన ఎడబాటును రూపుమాపి సన్నిహితత్వాన్ని కలిగించిన ఉత్తర ప్రత్యుత్తరములు తమ జీవితాలలో మరుపు రానివి. కాలం నిర్ణయించిన ఆ వియోగం తిరిగి వారు కలుసుకొని తిరిగే యోగ్యతను ప్రసాదించలేదు.

రాజు జీవితంలో ఒకచోట మాత్రం తప్పటడుగు వేశాడు. లేదు! వాడు ఏమాత్రం తప్పడడుగు వేయ్యాలేదు. వాడి "విధి" వాడిని ఆ విధంగా నడిపించింది.

శారద విషయంలో మాత్రం రవ్వంత చొరవ తీసుకొని సంచరించాడు రాజు.

అవును! శారద! చాలా యోగ్యురాలు. శారద చాలా సున్నితమయిన మనస్సు గలది. నాకు శారదకు గల పరిచయం మొదటిలో క్లాసుమేట్సుగా మాత్రమే అయినా, ఆమె ఆదరణ, ప్రేమ, ఆమెయందు ఏదో తెలియని వాత్సల్యాన్ని, అనిర్వచనీయమైన ఆత్మీయతను కలుగజేసింది.

మొట్ట మొదటినుండి కూడా శారదకు తన హృదయంలో ప్రత్యేక స్థానం యిచ్చేవాడు. శారదకూడా రాజుయందు ప్రత్యేక భావాన్ని కలిగియున్నదని తెలుసుకొనటానికి ఎక్కువకాలం పట్టలేదు. రాజుకు శారదలాంటి ప్రియురాలు లభించటం చాలా అదృష్టమని తను అనేకసార్లు మనస్సులో తీర్మానించుకొన్నాడు. ఆనాడు రాజును ఎంతగానో అభినందించాను. నిజానికి వారిద్దరిమధ్య ఏర్పడిన స్నేహం అంతగా పెంపొంది, అభివృద్ధి చెందటానికి కారణంకూడా తనేమోనన్పిస్తుంది.

ఒకరోజున బి. యస్సీ. రిజల్ట్సు వచ్చాయి. నేను, రాజు, శారద సెకండ్ క్లాసులో పాసయ్యాము. అప్పుడు తామంతా కలసి గాంధీ పార్కులో తమ భవిష్యత్‌ను గురించి ఆలోచిస్తూ జరిపిన ఆనాటి సమావేశం ఏనాటికీ మరువలేని రోజు.

రాజు కుటుంబ పరిస్థితులు మాత్రం వాడి కోరికలకు ప్రోత్సాహనీయంగా ఉండేవి కావు.

మానవుడు కోరికలనయితే పెంచుకొనగలడే గాని వాటిని యీడేర్చుకొనేందుకు తగిన అవకాశాలను ఎలా సృష్టించుకోగలడు ?

రాజు యం. బి. బీయస్. చదువాలన్న కోరిక వాడి జీవితంలో సశేషంగానే ఉండిపోయింది.

శారదకి, రాజుకి యం. యస్సీలో సీటు లభ్యం కావటంతో వైజాగులో ఆంధ్ర యూనివర్శిటీలో జేరటం సంభవించింది. ఆ అవకాశం వారిద్దరిమధ్య చిగురించిన ప్రేమకు మరింత దోహదాన్ని కలుగజేసింది. వారి అభిరుచులకు అనుగుణంగా ఏర్పడిన యీ అవకాశాన్ని ఏర్పరచిన భగవంతునిలో కూడ దయ జాలి, సానుభూతి, ప్రేమ అనేటువంటి గుణాలకు స్థానమున్నాయి అని తను అనుకునేవాడు.

రాజు వైజాగులో జేరిన క్రొత్తలో ఎక్కువగా శారదను గూర్చిన విశేషాలను అభివర్ణిస్తూ ఉత్తరాలను వ్రాసేవాడు. శారదకూడ స్నేహాన్ని పురస్కరించుకొని వ్రాసిన ఉత్తరాలలో రాజుయెడల తనకు గల ప్రేమను వ్యక్తం చేస్తూ వ్రాసేది. అలా వారిద్దరిమధ్య ఏర్పడిన స్నేహం నిష్కళంకమైన ప్రేమగా రూపొందుతూ, ఒక సంవత్సరపు అనుభవాన్నికూడ పురస్కరించుకొన్నది.

వేసవి సెలవులలో నేను రాజు, శారదలను కలుసుకొనే అవకాశం కలిగింది. మేమంతా కలసి సంతోషంగా గడిపిన ఆ రోజులు యింక తిరిగిరావు.

వారిద్దరిమధ్య ఏర్పడిన ప్రేమ, వాడు పొందుతున్న ఆనందం ఎక్కువకాలం కొనసాగలేదు. ఆ అన్యోన్యతను చూసి విధికి కన్నుకుట్టింది. ఫలితంగా రాజు జీవితాన్ని సవాలు చేసింది.

ఫలితంగా రాజువాళ్ళ కుటుంబ పరిస్థితులు మరింతగా దిగజారాయి. ఇంటియందు తను స్వీకరించవలసిన బాధ్యతలను, నెరవేర్చవలసిన కర్తవ్యాలను తల్చుకొని ఎంతగానో కుమిలిపోయాడు.

"ఏమిటి రాజూ! మరీ చిన్నపిల్లవాడిలా బాధపడి వగచినంత మాత్రాన ఏం ప్రయోజనం?" కాలం కలిసివస్తే అన్ని కష్టాలు గట్టెక్కుతాయి. అంతవరకు నీవు మనోధైర్యంతో నీ కర్తవ్యంలో లోపం లేకుండా ముందుకు సాగిపోతుండాలి" అని నేను పాడిన వంతపాట వాడిలో క్రమేపి మార్పును తీసుకొచ్చి ఆమాత్రము మనిషిగా చేశాయి.

కాని మానవుడు మాటలనయితే తేలికగా నేర్చుకున్నాడేగాని, కాలం చేసే నిర్ణయాలను, విధి నిర్ణయించే పరీక్షలలో నెగ్గే సమర్థతను సమకూర్చుకోలేక పోయాడు.

పాపం! ప్చ్! రాజును మరింత ఒంటరి వాడినిచేసి పరిక్షించింది విధి. ఖర్మానుసారంగా రాజు తనను కని, పెంచి పెద్దవాడినిచేసిన తలిదండ్రుల ప్రేమ, వాత్సల్యానికి ఎక్కువకాలం నోచుకోలేక పోయాడు.

విధి చేసే నిర్ణయానికి ఎవరు బాధ్యులు?

అప్పుడు నేను, శారద స్నేహపూర్వకంగా ఎంతగానో ఓదార్చి, వాడిని తిరిగి మామూలు మనిషిగా చేయాలని నిశ్చయించుకొన్నాము. మా కోరిక ఫలించటానికి ఎక్కువ కాలం పట్టలేదు. శారద మాటలలోని ఔదార్యం అతనికి జీవితంమీద ఆశను కలిగించాయి. కాని పరిస్థితులు అంతగా కలసి రాక పోవటంతో రాజు మానసికంగా చాలా నీరసించి పోయాడు. తనయొక్క దీనత్వాన్ని తలచుకొని లోలోన కుమిలిపోతుంటే, నేను ఒక్కొక్కసారి చూడలేకపోయేవాడిని. ఆ బాధను అర్థంచేసుకున్న నేను యిలా కష్టాలను సృష్టించి, మనుష్యులను మరింతగా క్షీణింపజేయాలనే భగవంతుడున్నాడేమో నని అనుకుంటూండేవాడిని; నిర్వికారుడైన భగవంతుని వలన మానవులకు యింతకుమించిన ప్రయోజనమేమి ఉండదా? అన్పించేది.

ఎలాగయితేనేమి, పెద్దలు జరిపిన సలహా సంప్రదింపులతో రాజుకు మిగిలిపోయిన ఒక్క సంవత్స

ర్థం యం. యస్సీ చదివే అవకాశము, అదృష్టం కలిగింది. ఈ బాధ్యత తనకు తాను స్వీకరిస్తానని వాడి మేనమామ రాజును అనునయిస్తూ, నిర్విచారంగా ఉండమని చెప్పాడు. ఆ తర్వాత రాజు తన ఉత్తరాలలో తన మేనమామగారి అభిప్రాయాలను తెలియజేస్తూ ఒకటో రెండో వాక్యాలను వ్రాస్తూ ఉండేవాడు.

స్వార్థం మనుష్యులచేత ఎంతటిపని చేయించటానికయినా వెనుకకు తిరుగనివ్వదు. తత్ఫలితంగా తన కూతురగు రాధకు రాజుతో వివాహంజేయాలన్న నిర్ణయాన్ని ఆయన బయల్పరిచారు.

ఈ విషయాన్ని తెలియజేస్తూ రాజు వ్రాసిన ఉత్తరం చదువుతోంటె నా హృదయం ద్రవించుకుపోయింది. శారదకు యీ విషయం తెలియజేస్తే ఏం అఘాయిత్యానికి పూనుకుంటుందోనని ఎంతగానో వాపోయేవాడు. శారద ఏర్పరచుకొన్న ఆశాసౌధాలన్నీ ఎలా కూలిపోతాయోనని అనేక రాత్రులను లెక్కపెట్టుకుంటూ ఏడ్చేవాడు. కాని ఏం చేయగలడు? తను అసమర్థుడు. విధి చేతిలోని కీలుబొమ్మ.

శారదకు నచ్చజేసి చెప్తే బాగుంటుందేమోనని అనుకునేవాడు. కాని హృదయం మైనమువంటి కరిగి మెత్తపడే స్వభావము కల పదార్థమయితే ఎటుపడితే అటు కావలసిన రీతులలో మలచవచ్చును. కాని మనస్సు అలాటి వస్తువుకాదు. అది పవిత్రమయిన ఒక మందిరం. అతి సున్నితంగా నిర్మించబడిన యీ మనస్సు ఎటువంటి ఘాతుకానికి ఒర్చుకోలేదు. ఒకసారికనుక మనస్సు వికలమయితే దానిని తిరిగి ఒక్కటిగా చెయ్యటం సాధ్యంకాని విషయం.

కాలం ఆగలేకపోయింది. సమస్యలు బయటకు తెలియకుండా ఉండలేకపోయాయి. పరిస్థితులు తారుమారయ్యాయి. ఊహకందని సంఘటనలు నిజస్వరూపములు దాల్చినాయి. నా ఆశలు అడియాసలయ్యాయి నా ప్రార్థనలు అర్థరహితమయినాయి. రాజు జీవితం వక్రించింది. ఫలితంగా రాజు వివాహం రాధతో నిశ్చయమయింది.

అంతే! ఆ మరునాడు శారద ఆత్మహత్య చేసుకున్నదన్న వార్త నలుగురి నోటిలోకి వెళ్ళింది. శారద శాశ్వతంగా మరొకరితో చెప్పకుండా యీ లోకంతో బంధాన్ని త్రెంచుకొన్నది శారద హఠాన్మరణానికి కారణం ఎవరికీ తెలియదు. అనేకమంది నోటిలో అనేక విధాలుగా యీవార్త వినవచ్చింది.

అటువంటి సమయములో రాజు హృదయం ఎలా తల్లడిల్లి పోయినది. అట్టి ఆవేదనను వాడు ఎలా భరించినది ఆత్మీయుడిగా నాకు తెలుసు.

శారద మరణవార్త వాడి హృదయాన్నిరాయిగా మార్చింది. అర్థరహితమైన గాంభీర్యాన్ని, నిర్వచనీయమైన కటుత్వాన్ని వాడిలో చూడగలిగాను. ఈ చైతన్యానికి కారణం బయటకు ఏమని చెప్పగలడు? ఎవరితో చెప్పుకోగలడు?

రాజు హృదయం చాలా దిటువయినది సహనంతో వాడు అనుభవించిన ఆ గడు రోజులు తిరిగి యీ లోకంలో ఎవ్వరికి కనీసం ఊహామాత్రంగానయినా రాకూడదు.

రాజు వివాహం, ఆ తర్వాత కొద్ది రోజులలోనే నా కళ్ళముందుగానే జరిగినది. ఆ పెళ్ళిని జరిపించిన పెద్దలలో నన్నుకూడా ఒకరుగా గుర్తించారు ఆ పెళ్ళికి వచ్చిన యితర పెద్దలు.

రాజు తన వివాహానికి ఆహ్వానిస్తూ "ఓరేయ్! రవి! నీవు గనుక నా వివాహానికి రాకపోతే, తిరిగి యీ జన్మలో యీరాజు సజీవంగా కన్పిస్తాడన్నది కలలోని వార్త" అని వాడు చెప్పిన మాటలు యీనాడు తిరిగి మరల ఒకమారు ప్రతిధ్వనించాయి.

అందువలన వాడి పెండ్లికి ఎన్ని పనులున్నా వీలు చేసుకొని వెళ్ళవలసిన కర్తవ్యం తనమీద ఉండబట్టి వెళ్ళక తప్పింది కాదు.

ఇప్పటికయినా వాడి జీవితంలో వసంతాలు తీసుకొని రమ్మనమని భగవంతుడిని మనసారా ప్రార్థించాను.

రాజు పెండ్లిరోజున వాడి మనస్సులో గూడు కట్టుకొని ఉన్న మూగబాధను, కళ్ళలోని అసంతృప్తిని, అన్నిటిని మించి పరిస్థితులకు తలొగ్గవలసిన వాడి కర్తవ్యం నన్ను ఎంతగానో కలవర పెట్టాయి.

ఆ శుభ సమయంలో వాడి కనుకొలకులలో నిలచిన అశ్రువులలోని అంతరార్థమేమిటో చూచాయగా నేను అర్థం చేసికోగలిగాను.

కనీసం రాధ సమక్షంలో నయినా వాడికి సుఖ సంతోషాలను ప్రసాదించమని కోరుకొంటు నలుగురితోపాటు నేనుకూడా ఆ నూతన వధూవరులను దీవిస్తూ అక్షంతలు వేశాను.

ఇంతలో ఏకబిగిన ధ్వనిచేస్తున్న కాలింగ్ బెల్ మ్రోత నన్ను యీ లోకంలోకి తీసుకొని వచ్చాయి.

ఇన్నేళ్ళ తర్వాత రాజు వ్రాసిన ఉత్తరంలో "రాధ మరణవార్తను వినవలసి వస్తుందని ఊహించని నాకు యింక పరిష్కారమంటూ ఉంటే, రాజు ఆత్మహత్య చేసుకోవటమేనా?" అనిపించింది. కాని రాజు యిక నాకు లేకుండా పోయాడన్న వార్త నాలో తీరని బాధను కలిగించింది.

ఇంతలో "ఏమండీ!" అన్న సుశీల పిలుపు నాకు బాహ్య ప్రపంచపు ఉనికిని గుర్తుకు తెచ్చాయి.

"మీరు వచ్చి చాలా సేపయినట్లుంది. నేను ఎంత కఠినాత్మురాలనండీ, నా పనిలో ఉండిపోయి యిటుకేసి రాలేకపోయానంటూ "గోడ గడియారం కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

"అయ్యో! నా పని, నేను పాడుగాను అప్పుడే ఎనిమిది గంటలయిందే" తననుతాను నొచ్చుకొంటున్న ధోరణిలో అన్నది.

"ఏమండీ! ఏమిటి అంత దిగజారిపోయి, విచారంగా కన్పిస్తున్నారు. హాస్పిటలులో ఏమయినా సీరియస్ కేసులు ఉన్నాయా?" అని తన మామూలు ధోరణిలో ప్రశ్నిస్తూ, రవి చేతిలో ఫాన్ గాలికి రెప రెప లాడుతున్న ఉత్తరాన్ని చూసి "ఏమండీ? ఈ ఉత్తరం ఎక్కడనుండి వచ్చిందండి?" అని ప్రశ్నిస్తూ అ ఉత్తరాన్ని చదివి పూర్తిచేసింది.

ఆమె కళ్ళలో ఆ ఉత్తరం చదవటం పూర్తయ్యాక నీళ్ళు నిలవడం నేను చూడగలిగాను.

పాపం! కాలం అతనికి ఆ విధమైన పరిష్కారాన్ని ఏర్పరిస్తే మీరు కోరుకున్నంతమాత్రాన సుఖ సంతోషాలు కలుగుతాయండి." అంటూ నన్ను ఓదార్చటానికి ఉపక్రమించింది.

"సార్! ఏదో అర్జంటు కేసు వచ్చింది" అంటూ కంపౌండర్ కృష్ణమూర్తి హడావుడిగా పరిగెత్తుకొని వచ్చాడు.

ఇందాక మ్రోగిన కాలింగ్ బెల్ అర్థమిదే అయి ఉండవచ్చని యిప్పుడు తెలుసుకోగలిగాను. కర్తవ్యం వర్తమానాన్ని సూచించగానే కుర్చీలోంచి లేచాను.

"అబ్బబ్బ! ఒకటే గొడవ! ఎప్పుడు ఏదో ఒక అర్జంటు కేసు! కనీసం కాఫీ త్రాగటానికయినా ఆస్కారం లేకుండా పోతున్నది. చూడండి! మీరు కర్తవ్యం, బాధ్యత అనుకొంటు అలా నిర్విరామంగా పనిచేసి యిలాగే నీరసించి పోతున్నారు.

"ఒక అయిదు నిమిషాలుండండి. హార్లిక్స్ కలుపుకొని తీసుకొని వస్తాను. అది సేవించిన పిమ్మట దొరగారు బయటకు వెళ్ళవచ్చునంటు" హడావుడిగా లోపలికి వెళ్ళింది.

"ప్రపంచమంతా యింతేనా?" అని అన్పించింది నా మనస్సులో.

★